RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 77 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | శుక్రవారం 20-02-2026 | పేజీలు -6 | వెల: రూ. 05.00

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

# మంచి ఫలితాలు సాధించారు

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై సీఎం, మంత్రులకు అభినందన

- ప్రజల తెలంగాణ లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ
- కాంగ్రెస్ అగ్రనేతలతో రెండు గంటల పాటు సీఎం, మంత్రుల భేటీ
- సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం
- మేడారం జాతర నిర్వహించినందుకు మంత్రి సీతక్కకు ప్రత్యేక అభినందనలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 అక్షర వేదం**

సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ

-మిగతా 2 లో





## మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

- మానవ అభివృద్ధిలో ఏఐది కీలక భూమిక
- భారత్‌లో ఏఐ పురోభివృద్ధి చరిత్రగా నిలుస్తుంది
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో

-మిగతా 2 లో



## వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

- ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం
- అధికారంలోకి రావడం ఖాయం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 అక్షర వేదం**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని

-మిగతా 2 లో



## ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

- ప్రజల సొమ్మును దుబారా చేయడంపై ఆగ్రహం
- పేదలకు విద్య తదితర కనీస అవసరాలు కల్పించాల్సిందే
- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,**

దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్

-మిగతా 2 లో

## త్వరలో తెలంగాణసహా 22 రాష్ట్రాల్లో 'సర్'..

- సరైన డాక్యుమెంట్లు లేని ఓట్లను తొలగింపు
- సిద్ధమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,**


నిజమైన ఓటర్లను గుర్తించేందుకు, అర్హతలేని, అక్రమ ఓట్లను తొలగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ వంటి రాష్ట్రాల్లో 'సర్'ను పూర్తి చేసింది సీఈసీ. ఇప్పుడు మిగతా రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కూడా 'సర్' చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో తెలంగాణ కూడా ఉంది.మన రాష్ట్రంతోసహా 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈసారి 'సర్' చేపడుతారు. ఇప్పటికే కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు మిగిలిన రాష్ట్రాల్లోనూ 'సర్' నిర్వహిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్త 'సర్' మొదలవుతుంది. ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్, బిహార్‌లలో కొనసాగుతోంది. బిహార్‌లో ముగింపు దశకు చేరుకుంది. ఢిల్లీ, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లదాఖ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, తెలంగాణ, ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, అరుణాచల్ ప్రదేశ్,

-మిగతా 2 లో




## 21 నుంచి 24 వరకు వడగండ్ల వానలు..

- హెచ్చరించిన వాతావరణ శాఖ
- రుతువుల మార్పిడితో కురిసే అవకాశం




# ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్

## పోస్టింగ్‌ల కోసం పోలీసుల తొత్తు వ్యవహారాలు



- క్యాతన్‌పల్లిలో బలమున్నా మంత్రి వివేక్ దుర్మార్గం
- వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే..అప్పడ చూపిస్తాం
- మీడియాతో హరీష్ రావు వ్యాఖ్య..
- జైలులో బాల్క సుమన్‌కు పరామర్శ

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 19 అక్షర వేదం**

ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అడుగులకు మడుగులు ఒత్తుతున్న పోలీసుల అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ను గురువారం పరామర్శించారు. అనంతరం జైలు బయట హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. క్యాతనపల్లి మున్సిపల్‌లో 22 స్థానాలకు గాను 14 స్థానాలను బీఆర్ఎస్ గెలిస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా, చైర్మన్ ఎన్నిక రోజు కావాలనే పోలీసు బందోబస్తు లేకుండా

-మిగతా 2 లో



## అట్టడుగున ఆంధ్ర రాష్ట్ర పురోగతి

- వృద్ధిరేటులో దూసుకుపోతున్నట్లు ప్రకటనలు
- రాష్ట్ర ఆదాయాలు పక్కదోవ పట్టాయి
- దోచుకో..పంచుకో..తినుకో
- ఇదే చంద్రబాబు విధానం అంటూ జగన్ విమర్శలు

**అమరావతి,**

మన రాష్ట్ర పురోగతి అట్టడుగున ఉందని..కానీ వృద్ధిరేటులో దూసుకుపోతున్నట్లు చంద్రబాబు చెప్తున్నారని మాజీ సీఎం జగన్ అన్నారు.. చంద్రబాబు ఎవరికి చెవిలో పూలు పెడుతున్నారు.. తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఆయన రాష్ట్ర పరిస్థితులపై మాట్లాడారు. చంద్రబాబు రాష్టానికి సంబంధించిన ఆదాయాలు పక్కదోవ పట్టాయన్నారు.. దోచుకో.. పంచుకో.. తినుకో అన్నట్లుగా టీడీపీ నేతల వ్యవహారం ఉందని విమర్శించారు.. వనరులు మొత్తం దోచేస్తున్నారన్నారు.. ఆయనకు ఒక విమానం.. దాంతో ఒక హెలికాప్టర్ ఉందని.. లోకేష్, పవన్‌కు కూడా సేమ్ అలాగే ఉన్నాయన్నారు. కొలంబో వెళ్ళి మ్యాచ్ చూస్తాడు.. తర్వాత రోజు ఉదయాన్నే విజయవాడ వస్తారని విమర్శించారు. ప్రైవేట్ ఫ్లైట్‌లో కొలంబో వెళ్ళి మ్యాచ్ చూస్తారు.. టీవీలో చూస్తే మ్యాచ్ కనిపించదా?.. నేను కూడా మ్యాచ్ టీవీలోనే చూశానన్నారు. అప్పలపై మళ్ళీ మళ్ళీ గోబెల్స్ ప్రచారాలు చేస్తున్నారని.. ఎన్నిసార్లు సాక్ష్యాలు, ఆధారాలు చూపినా అదే అబద్దాలు ఆడుతున్నారన్నారు.. కుక్క తోక వంకర అన్నట్లుగా చంద్రబాబు వ్యవహారం ఉందని తీవ్రంగా విమర్శించారు..

-మిగతా 2 లో



## కేసీఆర్ జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలి

- జాతిపిత గాంధీతో కేసీఆర్ కు పోలికాన
- ప్రజల సమస్యలపై ఎందుకు మాట్లాడరు..
- ఎందుకు అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తారు
- కేసీఆర్ జాతిపిత ప్రకటనపై మండిపడ్డ కడియం శ్రీహరి

**జనగామ, ఫిబ్రవరి 19 అక్షర వేదం**

తెలంగాణ రాజకీయాల్లో 'జాతిపిత' అనే పదం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. బీఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆయన పార్టీ నేతలు 'తెలంగాణ జాతిపిత'గా అభివర్ణించడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రంగా తప్పుబట్టారు. భారతదేశానికి జాతిపిత ఒక్కరేనని, ఆయన మహాత్మా గాంధీ అని.. అలాంటి మహనీయుడితో కెసిఆర్‌ను పోల్చడం గాంధీజీని అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. అసలు కెసిఆర్ కు జాతిపిత

-మిగతా 2 లో

## తెలంగాణ ఇంటర్ హాల్ టిక్కెట్లు విడుదల

- షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- ఈ ఏడాది దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు
- హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 అక్షర వేదం**

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హాల్ టికెట్ల ప్రక్రియ పూర్తయింది. మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాది దాదాపు 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండటంతో,

-మిగతా 2 లో



# మన ఆలోచనలకు అందనంతగా ఏఐ



మొదటి తరువాయి

దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేథకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుందని, అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుందని అన్నారు. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో మనం ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేథను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న అని అన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేథ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేథ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు.

# ఉచిత పథకాలపై మరోమారు సుప్రీం సీరియస్

మొదటి తరువాయి

అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం పరోక్షంగా హెచ్చరించింది.

# వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

మొదటి తరువాయి

పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ నిర్మాణం జరగాలని, సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

## త్వరలో తెలంగాణసహా 22 రాష్ట్రాల్లో 'సర్'..

మొదటి తరువాయి

చండీగఢ్, దాద్రా అండ్ నగర్ హవేలి, డామన్ అండ్ డియులో ఏప్రిల్ నుంచి 'సర్' చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. 'సర్'లో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఓటర్లను గుర్తిస్తారు. ఆ ఇంట్లో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఆధార్ వంటి ధృవపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తమ వివరాలు సమర్పించి ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు. సరైన డాక్యుమెంట్లు లేని ఓట్లను తొలగిస్తారు.

# 21 నుంచి 24 వరకు వడగండ్ల వానలు..

**హెచ్చరించిన వాతావరణ శాఖ రుతువుల మార్పిడితో కురిసే అవకాశం**



హైదరాబాద్,

రాష్ట్రంలో మూడ్రోజులపాటు పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురిసే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. మారిన వాతావరణ పరిస్థితు ల కారణంగా ఈ నెల 21 నుంచి 24 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కు రిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. 22న ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లా ల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినా ఉరుములు, మెరుపులతో గాలివానలు బీభత్సం సృష్టించే అవకాశాలున్నట్టు తె లిపింది. హైదరాబాద్‌లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని, నె లాఖరు వరకు వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

# మంచి ఫలితాలు సాధించారు

మొదటి తరువాయి



కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్

మొదటి తరువాయి



చేసి, చైర్మన్ ఎన్నిక జరగకుండా వాయిదా పడేలా చేశారని ఆరోపించారు. అధికారులు, పోలీసుల సమక్షంలో, మంత్రి వివేక్ చూస్తుండగానే దళిత, గిరిజన, మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. బాల్క సుమన్, కోవ లక్ష్మిలను లోపలికి పంపించకుండా కేవలం కాంగ్రెస్ మంత్రిని ఎలా పంపిస్తారని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై దాడి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులే దాడులు చేశారంటూ పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి బాల్క సుమన్‌ను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాతన్‌పల్లి, జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్ లో బీఆర్ఎస్ నాయకులను, కౌన్సిలర్లను పోలీసు బలగాలతో భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. జనగామలో ఓటింగ్ కోసం బీఆర్ఎస్ కౌన్సిలర్ చేతి పైకెత్తితే, వెనుక నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్లు చేతులు పట్టి లాగి బెదిరించే ప్రయత్నం చేశారని, అందులో దళిత మహిళ చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో తమ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నా ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం చేశారని, అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మెజారిటీ ఉన్నా గాని తాము అరాచకానికి పాల్పడలేదని వెల్లడించారు. బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి తీరు జుగుప్సాకరంగా ఉందని హరీశ్ విమర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ల కోసం బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకునేది లేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తగిన మూల్యం చెల్లించుకుంటారని పోలీసులను మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. 'రాహుల్ గాంధీ.. మీ రాజ్యాంగం ఏమైందో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి ఇన్సిడెంట్‌పై గవర్నర్ రిపోర్ట్ తెప్పించుకోవాలని హరీశ్ రావు కోరారు. 'వినాశకాలే విపరీత బుద్ధి.. పోలీసులూ తస్మాత్ జాగ్రత్త' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వార్నింగ్ ఇచ్చారు. కాగా, జైల్లో ఉన్న బాల్కసుమన్‌ను హరీశ్ రావుతో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ మంత్రి రామన్న పరామర్శించారు.

# కేసీఆర్ జాతిపిత అని చెప్పకోవడానికి సిగ్గుండాలి

మొదటి తరువాయి

అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఆయన అత్యంత ఘాటుగా విమర్శించారు. నిజంగానే కెసిఆర్ జాతిపిత అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఎందుకు స్పందించడం లేదని కడియం శ్రీహరి ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడాల్సిన ప్రతిపక్ష నేత, అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఎక్కడ ఉన్నారని ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎందుకు నిలదీయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం సెంటిమెంట్‌ను వాడుకుని రాజకీయాలు చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టాలను తీర్చే ఉద్దేశం కెసిఆర్‌కు లేదని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని కడియం ఆరోపించారు. అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి, ఓటు వేయడానికి ఇష్టపడలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులను కూలిపోయేలా నిర్మించడమే కాకుండా, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి దివాళా తీయించారు. ఎన్నో స్కామ్‌లలో ఇరుక్కున్న నేతను జాతిపిత అని ఎలా పిలుస్తారని ఆయన నిప్పులు చెరిగారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదని కడియం దుయ్యబట్టారు. వారి అహంకారం, అహంభావం వల్లే ప్రజలు వారికి దూరమయ్యారని, ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారని, ఇది ఎవరి సొత్తు కాదని గుర్తు చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రవర్తించకపోతే భవిష్యత్తులో ప్రజలు మరింత గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# తెలంగాణ ఇంటర్ హాల్ టిక్కెట్లు విడుదల

మొదటి తరువాయి

బోర్డు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. అయితే, విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయంతో పాటు, వారి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ల నుండి ధ్రువీకరించిన హాల్ టికెట్లను తీసుకోవాలని బోర్డు సూచించింది. విద్యార్థుల సౌకర్యార్థం వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే లింక్‌ను కూడా పంపుతున్నారు. ఈసారి సాంకేతికతను జోడిస్తూ బోర్డు కీలక మార్పులు చేసింది. విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలను సులభంగా , ఖచ్చితంగా గుర్తించడానికి వీలుగా హాల్ టికెట్లపై కోడ్ ను ముద్రించారు. దీనిని స్కాన్ చేయడం ద్వారా సెంటర్ లొకేషన్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఒకవేళ హాల్ టికెట్‌లో పేరు, ఫోటో, సంతకం లేదా సబ్జెక్టులకు సంబంధించి ఏవైనా తప్పులు ఉంటే, వెంటనే కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని అధికారులు హెచ్చరించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హాల్ టికెట్లు అందిన వెంటనే అన్ని వివరాలు సరిచూసుకోవడం, పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందే సందర్శించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరు నుంచే ప్రారంభం కానున్న ఈ వార్షిక పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా వందలాది కేంద్రాలను సిద్ధం చేశారు.

# అట్టడుగున ఆంధ్ర రాష్ట్ర పురోగతి

మొదటి తరువాయి

ప్రజలకు తెలిసిపోతుంది అని బ్జడెట్ పేపర్స్ లో అప్పుల టేబుల్ ఎత్తివేశారన్నారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ఇక్కడ దాచిపెట్టవచ్చు కానీ ఇతర నివేదికల్లో ఏమీ చేయలేరని తెలిపారు.. ఎవరి హయాంలో ఎంత అప్పు అనేది కాగ్ విడుదల చేసిన లెక్కలు చూసినా కనిపిస్తుందని క్లియర్ గా ఉంటుందని మాజీ సీఎం జగన్ అన్నారు.. 2023-24 కు రాష్ట్రానికి సంబంధించిన అప్పులు మొత్తం రూ. 2, 57, 509 కోట్లు.. చంద్రబాబు దిగితే నాటికి రూ. 3.90 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయన్నారు.. లెక్కలు ఎంత క్లియర్‌గా ఉన్నా చంద్రబాబు మాత్రం గ్లోబెల్స్ ప్రచారం ఆపరని.. తమకు రూ. 9 లక్షల కోట్లు అప్పులు మిగిల్చి వెళ్లారని ఘోరంగా అబద్దాలు ఆడుతున్నారన్నారు? ఈ ప్రభుత్వం ఈ 20 నెలల కాలంలో చేసిన అప్పులు రూ. 3.17, 448 కోట్లు అని ఆరోపించారు.. వాస్తవాలు ఆధారాలతో కనిపిస్తున్నా బడ్జెట్ డాక్యుమెంట్స్‌తో గేమ్ ఆడుతూనే ఉంటారన్నారు..

# పీవీడి 8వ ఎడిషన్ నిర్వహించిన ఇండియా క్రెడిట్

**-పశువికాస్ డే ద్వారా 'సర్వోత్తం సేవ'లో ముందంజ**
**-1.55 లక్షలకు పైగా గ్రామీణ జీవితాలపై ప్రభావం**
**-ఎస్.ఎం.ఎఫ్.జి ఇండియా క్రెడిట్ సీఈఓ రవి నారాయణన్**



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (అక్షర వేదం) : దేశంలోని ప్రముఖ ఎన్.బి.ఎఫ్.సిలలో ఒకటైన ఎస్ఎంఎఫ్ జి ఇండియా క్రెడిట్, దాని ప్రధాన పశువుల సంక్షేమం, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం అయిన పశు వికాస్ దినోత్సవం(పీవీడి) యొక్క 8వ ఎడిషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్.ఎం.ఎఫ్.జి ఇండియా క్రెడిట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రవి నారాయణన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పశు వికాస్ దినోత్సవం 47 ప్రదేశాలలో నిర్వహించామని తెలిపారు. మొత్తం 8,350 కి పైగా పశువులకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలను ఉచితంగా అందించిన ఈ కార్యక్రమం 2,300కి పైగా గృహాలకు ప్రయోజనం చేకూర్చిందన్నారు. 'సర్వోత్తమ సేవ, పశు, పరివార్ ఔర్ ప్రగతి' అనే ఇతివృత్తంతో ప్రారంభించబడిన ఈ కార్యక్రమం, పశువుల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, స్థిరమైన పురోగతిని బలోపేతం చేయడం ద్వారా సమగ్ర గ్రామీణ అభివృద్ధికి సంస్థ యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించిందని తెలిపారు. 2014లో ప్రారంభించి 1.55 లక్షలకు పైగా గ్రామీణ జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేసిందని చెప్పారు. వీటిలో సుమారు 1.4 లక్షల పశువులకు ఉచిత చికిత్స, 14 వేల మందికి పైగా వ్యక్తులకు ఆరోగ్య సంరక్షణ సహాయం అందించినట్లు చెప్పారు.

# బాల్క సుమన్ అరెస్ట్ చేయడమంటే.. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడమే: కౌశిక్ హరి




అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి19 రామగుండమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. రాజ్యాంగాన్ని కాపాడాలని ఒకపక్క కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని దేశమంతా తిరుగుతుండు.. మరి తెలంగాణలో రాజ్యాంగాన్ని ఖూని చేసినప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులు ఇక్కడి పాలకులకు అధికారులకు కనబడుత లేవా అని బిఆర్ఎస్ నాయకులు కౌశిక హరి ప్రశ్నించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్ రావు మాట్లాడుతూ... మాజీ ఎంపీ, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా కేతనపల్లి మున్సిపల్ కు జరిగిన ఎన్నికలలో 22 వార్డులకు బి.ఆర్.ఎస్, సిపిఐ అభ్యర్థులు 14 మంది గెలుపొందారని, కాంగ్రెస్ ఏడుగురు గెలుపొందారు. చైర్మన్ గా బిఆర్ఎస్ అభ్యర్థి ని ఎన్నుకుంటారు. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ రాజ్యాంగమని చెప్పి, చేతుల పట్టుకుని తిరుగుతుంటాడు. కానీ ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ కూడా రాజ్యాంగం అమలు అయితలేదు. ఎక్కడ చూసినా దౌర్జన్యం ఒక అధికార యంత్రాంగం పని అనేది లేకుండా అధికారుల ప్రమేయం లేకుండా అధికారులందరూ కూడా చాలా ప్రాంతాలలో రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా కాంగ్రెస్ కండువా కప్పుకొని పనిచేస్తున్నటువంటి కార్యకర్తలు లాగానే వ్యవహారం జరుగుతున్నది అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు మొదలైన నాటి నుంచి చూసుకుంటే ఎక్కడ చూసినా టిఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తూ అనేక మందిని ఉపసంహరించుకునేలా బెదిరించారని ఇదేనా ప్రజాస్వామ్యం అంటే అని ప్రశ్నించారు. కేతనపల్లిలో అక్కడ ఉన్నటువంటి మంత్రి కావచ్చు ఎంపీ కావచ్చు ఒక వారం రోజులుగా దౌర్జన్యకరమైనటువంటి అహంకార ధోరణి అవలంబిస్తున్నారని దుయ్యబట్టారు. వారు ఉన్న మంచిర్యాల జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ బందు పిలిపిస్తే విజయవంతమైంది. అంటే ఇవాళ ఒక మున్సిపల్ ఎన్నికల కోసం వేల మందిని పోలీసులతో ఇవాళ ఊర్ల మీద పడి యుద్ధం చేసే విధంగా పోలీసు వ్యవస్థను వాడుకొని వాళ్ళ కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది చేస్తున్నది. టిఆర్ఎస్ కార్యకర్తలపైన దాడి చేసి బాల్క సుమన్ ను అరెస్ట్ చేయడం దుర్మార్గం అన్నారు. రామగుండంలో కూడా ఎన్నికలు జరిగాక రాత్రి స్ట్రాంగ్ రూమ్ లో బ్యాలెట్ బాక్సుల కు సరైన భద్రత ఉన్నదా అనే అనుమానం కలుగుతుందన్నారు. రాత్రి సుమారు మూడు గంటలు విద్యుత్ సరఫరా ఎందుకు లేదో అధికారులు సంబంధిత సీసీ ఫుటేజ్ విడుదల చేయాలని కోరారు. ఓడిపోతారు అనుకున్న వారు గెలిచారని కచ్చితంగా గెలుస్తారు అనుకునేవారు ఎలా ఓడిపోయారని బ్యాలెట్ బాక్సులపై అనుమానం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# యోగా తో ఆరోగ్య పరిరక్షణ సాధ్యం: అంజలి బెహన్

**నిత్య జీవితంలో ఒత్తిడిని యోగాతో జయించండి..**



అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి19 సింగరేణి ఆర్జీ1 జీఎం ఆఫీసులో గురువారం జరిగిన కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులకు బ్రహ్మ కుమారి అంజలి బెహెన్ నిత్య జీవితంలో ఒత్తిడికి కారాణాలు, నివారణా మార్గాలపై ఉచిత అవగాహన వర్క్ షాఫ్, ద్యాన శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం లలిత్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బ్రహ్మ కుమారి అంజలి బెహెన్ మాట్లాడుతూ... ప్రతి మనిషి ఆశలకి అంతు ఉండదు, ఉన్న వాటితో తృప్తి ఉండదు లేనివాటి కొసం ఆలోచిస్తారు. ఉన్నవాటిని మర్చిపోతారు. ఏదైనా ఉన్నప్పుడు పట్టించుకోరు, లేనప్పుడు కావాలంటారు. జీవితం కూడా ఈలాగే ఉంటుంది. ఉన్నదానితో తృప్తి చెందాలని తెలిపారు. ప్రస్తుత మానవుడు తనకు లభించిన సౌకర్యాలు పెరుగుతున్నప్పటికి, ఒత్తిడిని తగ్గించుకోలేక వయస్సుతో నిమిత్తం లేకుండా ఒత్తిడికి లోనవవుతున్నారని, కర్మ యోగం ద్వారా దీనిని తగ్గించుకోవచ్చునని తెలిపారు. ప్రతి మానవుడు రోజు ఒక గంట సమయం నిత్య జీవితంలో ఆరోగ్యంపై కెటాయిస్తే ఏలాంటి జబ్బులు దరిచేరవని యోగా ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. యోగా ద్వారనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధింస్తుందని సంస్థలో పని చేయుచున్న ఉద్యోగులు వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమం నిర్వహించబడుతున్నదని ప్రపంచ వ్యాప్తంగా యోగా బహుళ ప్రాచుర్యం పొంది నేడు ఆరోగ్య ప్రధాయినిగా నిలుస్తున్నదని దీనిని అందరు ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగా శిక్షణ ఆచరించి మంచి ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యస్ ఓటు జీఎం చంద్రశ్రేఖర్, డిజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయి, ఇంటర్నల్ ఆడిట్ మేనేజర్ మోహన్ రావు, సీనియర్ పిఓ శ్రావణ్ కుమార్, సెక్యూరిటి అధికారి వీరారెడ్డి, బ్రహ్మ కుమారీస్ పద్మ, కీర్తి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో ఎస్ఎస్ ప్రొ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభం



అక్షర వేదం/మేడ్చల్ మల్కాజిగిరి/మేడిపల్లి:ఫిబ్రవరి19, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధి పీర్జాదిగూడలోని వెంకట్ సాయి నగర్‌లో ఎస్ ఎస్ ప్రో బాడ్మింటన్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ పీర్జాదిగూడలోని క్రీడాభిమానులు అ అకాడమీని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ కోచింగ్ ఇవ్వడానికి ముందుకొచ్చిన యాజమాన్యాన్ని అభినందించారు. స్థానిక యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు ఈ అకాడమీ వేదిక కావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఇక్కడి ప్రాంతానికి, అకాడమీకి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. బ్యాడ్మింటన్ వంటి క్రీడలు శారీరక, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని, మానసిక రుగ్మతలను నియంత్రిస్తాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీ యజమానులు సాయికాంత్, శైలేందర్ సింగ్ ఠాకూర్, విజయ్ కృష్ణ, జాన్, కోచ్ అశోక్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పీర్జాదిగూడ అధ్యక్షులు, ఆర్‌వీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుంగతుర్తి రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి సతీష్, కుర్ర శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026కు ప్రొ.చంద్రముఖర్జీని



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (అక్షర వేదం) : ప్రపంచ మాతృభాష దినోత్సవ సందర్భంగా లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ ఎక్స్ లెన్స్ అవార్డ్స్-2026 కు నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చంద్రముఖర్జీని (ఉస్మానియా యూనివర్సిటీ)నుండి హిందీ భాషలో ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21న ఉదయం 10 గంటలకు నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల సెమినార్ హాలులో ఈ అవార్డ్స్-2026 తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ అయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొ.వి.బాలకిష్టా రెడ్డి, ప్రముఖ విద్యావేత్త లయన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, డైరెక్టర్ లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ లయన్ ప్రేమ్ చెంద్ మునోత్ జైన్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు.

# మంథని మున్సిపాలిటీ నూతన పాలక వర్గ సన్మాన సభలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్వేష్ గౌడ్



అక్షర వేదం/మంథని,ఫిబ్రవరి19: కాంగ్రెస్ పార్టీ లో కష్టపడే కార్యకర్తలకే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గుర్తింపు ఇస్తున్నారని మంథని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూదరి సర్వేష్ గౌడ్ అన్నారు.మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం రోజున నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ ముసుకుల సయేందర్ రెడ్డి తో పాటు కౌన్సిలర్లను సర్వేష్ గౌడ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్వేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని అందుకు నిదర్శనమే గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికలని ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కార్యకర్తలను సర్పంచ్ లుగా,కౌన్సిలర్లుగా గెలిపించి ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అందుకు కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబును సర్వేష్ గౌడ్ అభినందించారు.రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ పార్టీలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ ముసుకుల సురేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కన్నూరి రవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు తోకల మల్లేష్,కొయ్యల దేవేందర్ యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# రవీంద్రభారతిలో మరుగుజ్జుల అసోసియేషన్ రజితోత్సవం ...

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు**

**ఆహ్వాన పత్రాన్ని అందజేసిన అసోసియేషన్ అధ్యక్షుడు బి మల్లేష్.**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజిగిరి/ మేడిపల్లి: ఫిబ్రవరి 19,** పిర్జాదిగూడలోని వారి కార్యాలయంలో మరుగుజ్జు అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని తీన్మార్ మల్లన్న ని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బి. మల్లేష్ మాట్లాడుతూ.. 2003 నుండి తమ సంస్థ మరుగుజ్జుల ఉపాధి, హక్కులు మరియు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ నెల 26వ తేదీన (గురువారం) మధ్యాహ్నం 1:00 గంటకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి (మినీ హాల్) లో నిర్వహించే రజతోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోరారు. వీరితోపాటు తోటి మరుగుజ్జులు పాల్గొన్నారు.

# జెఈఈ మెయిన్స్ లో మెరిసిన బీసి గురుకుల ఎంజేపీ విద్యార్థులు

**-అభినందనలు తెలిపిన ప్రిన్సిపాల్ బి. స్రవంతి**



**అక్షర వేదం హైదరాబాద్ ఫిబ్రవరి 19** పఠాన్ చెరు మండలంలోని చిన్న కంచర్లలో ఉన్నా బీసీ గురుకుల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ కు దీటుగా జేఈఈ మెయిన్స్ లో ఉత్తమ ఫలితాలు సాధించారు.జేఈఈ మెయిన్స్ లో ఎచ్.సాయి ప్రణీత్,( 80.95%) జె. దేనిష్ కార్తీక్,(79.42%)డి. కార్తీక్ (76.66% )2026 జేఈఈ మెయిన్స్ లో మంచి ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా ఎంజేపీ గురుకుల ప్రిన్సిపాల్ బి. స్రవంతి, మాట్లాడుతూ.. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా నిష్టాతులైన అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతుందని విద్యార్థుల నిరంతర శ్రమ వల్ల ఇది సాధ్యమైంది అని తెలిపారు. విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని వచ్చే సంవత్సరంలో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని అన్నారు. విద్యార్థులకు ఎల్లప్పుడు పుస్తకాలు, విద్యా పరంగా ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏటీపీ రేఖాలక్ష్మి, అధ్యాపక బృందంతో కలిసి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బోరుబావికి భూమి పూజ.






**అక్షర వేదం/ మల్లాపూర్ :ఫిబ్రవరి: 19** మల్లాపూర్ మండలంలోని సాతరం గ్రామంలో 1వ,వార్డులో నీటి సమస్య ఉన్నందున గ్రామ సర్పంచ్ పోతవేన్ నారాయణ గౌడ్ మరియు ఒకటో వార్డు సభ్యులు వుడుగుల శేఖర్ కలిసి గురువారం బోరుబావికి భూమిపూజ నిర్వహించారు. రానున్న వేసవికాలం దృశ్య నీటి సమస్య పరిష్కరించడానికి ఈ బోరు బావి వేయడం ఎంతో సంతోషకరమని ఒకటో వార్డు వారు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బేతి జగన్ రెడ్డి, వార్డు సభ్యులు అచ్చ చిన్న రాజం, కుంభం శేఖర్ యాదవ్, పోతర్ల ప్రవీణ్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# మొగిలిపేట గ్రామం లో ఛత్రపతి శివాజీ శోభా యాత్ర.



**అక్షర వేదం /మల్లాపూర్ : ఫిబ్రవరి :19:** మండలం లో ని మొగిలిపేట గ్రామం లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు సందర్భంగా గురువారం మొగిలిపేట గ్రామంలో శివాజీ శోభా యాత్ర చేయడం జరిగింది , ఈ కార్యక్రమం లో సర్పంచ్ గోల్కొండ కళ రమేష్.మద్దూరి ప్రశాంత్. రమణ చారి. గోల్కొండ పవన్. మోరపాక ధర్మరాజు. సాయిలు.యువకులు తదితరులు పాల్గొన్నారు

# భౌతిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో ఆరెంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ



**అక్షర వేదం/మంథని,ఫిబ్రవరి19:** మంథని మండలంలో నిర్వహించిన మండల స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పరీక్షకు అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించే లక్ష్యంగా ఈ పరీక్షను గురువారం రోజున ఈ పరీక్షను నిర్వహించారు.ఈ పరీక్షలో ఆరెంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తిప్పని ఆకాశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు.మొత్తం యాభై మార్కులకు గాను నలభై నాలుగు మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చాడు.ఆకాశ్ సాధించిన విజయంపై పాఠశాల హెచ్ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన నేపథ్యంలో ఫిబ్రవరి ఇరవై మూడున జరగనున్న జిల్లా స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పోటీలకు ఆకాశ్ ఎంపికయ్యాడు. జిల్లా స్థాయి పోటీల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించేలా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు పద్మజ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.ఆ పరీక్షలకు అవసరమైన సిలబస్,మోడల్ ప్రశ్నలు,సమస్య పరిష్కార విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం నరసింహారావు ఆకాశ్‌కు ఆర్థిక సహాయం అందించి మరింత ప్రోత్సహించారు. విద్యార్థి పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, సువార్త, గియశోద్దీన్, వోడ్నాల సహేందర్,మమత,శ్రీవాణి, శ్రీలత, సీఆర్పీ మల్లన్న,అమన్ తదితరులు పాల్గొన్నారు.

# వంగమర్తిలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**- ఈ వేడుకలో పాల్గొన్న బిజెపి పార్టీ జిల్లా నాయకులు జమ్ము రమేష్**



**అక్షర వేదం/ నల్గొండ/శాలిగౌరారం, ఫిబ్రవరి 19:** నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఛత్రపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామస్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఛత్రపతి యూత్ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "జై శివాజీ.. జై భవాని" అంటూ యువత చేసిన నినాదాలతో గ్రామం మారుమోగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ సకినాల వరలక్ష్మి నరసయ్య మరియు బిజెపి జిల్లా నాయకులు జమ్మూ రమేష్ మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు, స్వరాజ్య స్థాపనకు శివాజీ చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. ఆయన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, శివాజీ మహారాజ్ ఆశయ సాధనలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ దేగల ఎలేషా, బెల్లి వీరభద్రం, వార్డు సభ్యులు నూక మహేష్, కాంతయ్య, చందు, అశోక్, గోపి, ఐలపాక చింటూ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన ఛత్రపతి యూత్ కమిటీ సభ్యులు బెల్లి సందీప్, ఉడుగు రమేష్, రూపాని కృష్ణయ్య, జ్యోతి సురేష్, నూక సుధాకర్, అశోక్, రమేష్, సందీప్, సంపత్, నరేష్, శివ, గోవర్ధన్ మరియు ఇతర యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యదర్శులకు,ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం



**అక్షర వేదం, జైపూర్, ఫిబ్రవరి 19** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.సమీక్ష సమావేశం యొక్క మినిట్స్.1. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేసి ఈ నెల ఆఖరి వరకు అన్ని గ్రామ పంచాయతీలను 100% పూర్తి చేయాలి. 2. పెండింగ్లో ఉన్న ట్రేడ్ లైసెన్సును సంబంధిత షాపులు యజమానులతో మాట్లాడి వెంటనే రెన్యువల్ చేయించాలి. 3. 15 వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ నుండి పెండింగ్ బిల్లులు వెంటనే పేమెంట్ పూర్తి చేయాలి.4. పెండింగ్ లో ఉన్న ఆర్ టి ఐ దరఖాస్తులను వెంటనే దరఖాస్తు దారులు కోరిన సమాచారము అందజేసి ఒక కాపీని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమర్పించగలరు.5. ప్రతిరోజు ఉదయం 9 గంటల లోపు అటెండెన్స్ ఇచ్చి వెంటనే డి ఎస్ ఆర్ నమోదు చేయాలి.6. ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎక్కడ కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు లేకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి. 7. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి జెర్మినేషన్ 100% ఉండేలాగున తగు చర్యలు తీసుకోవాలి. 8. ప్రతిరోజు గ్రామపంచాయతీకి సకాలంలో చేరి అటెండెన్స్ డి ఎస్ ఆర్ నమోదు చేయాలి. ఈరోజు 12 మంది పంచాయతీ కార్యదర్శులు 9 తర్వాత అటెండెన్స్ నమోదు చేసినారు. మరోసారి ఇది పునరావృతం కాకుండా చూసుకోవాలి.9. వార్డు మెంబర్ల శిక్షణా తరగతులకు ముందుస్తుగానే అందరికీ సమాచారం అందించి షెడ్యూల్ ప్రకారం అందరూ వార్డ్ మెంబర్లు శిక్షణ తరగతులకు హాజరైలాగున తగు చర్యలు చేపట్టాలి. 10. వాడు మెంబర్ల యొక్క ఆధార్ తో ఫోన్ నెంబరు అనుసందరమైనదా లేదా చూసుకొని కాకుంటే కనుక వెంటనే అటాచ్ చేయాలి. 11. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి. 12. ప్రతి గ్రామపంచాయతీలో ఈజీఎస్ లేబర్ లను 307 కు తగ్గకుండా వచ్చేలాగున చూసుకోవాలి.13. ఉపాధి హామీ పనులకు లేబరు వచ్చే విధంగా వారిని మోటివేషన్ చేయాలి. 14. ఫైనల్ ఫోటో క్యాప్చర్ రేపటి వరకు పూర్తి చేయాలి బ్యాంక్ అకౌంట్, ఆధార్, జాబ్ కార్డుల వివరాలు సేకరించాలి. ఇట్టి సమావేశంలో ఎంపీడీవో జి.సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావు , ఏపీవో బి.బాలయ్య , అన్ని గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం కప్పు కబడ్డీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనా సర్వాయిపేట క్రీడాకారులు

**- ఆర్థిక సహాయం అందించిన సర్వాయిపేట సర్పంచ్ లంగారి రాజు**



**అక్షర వేదం/పలిమెల,ఫిబ్రవరి 19 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన పెద్ది భవాని, గావిడి సషిత, సోమనపల్లి సురేంద్ర అనే విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నిరుపేద గ్రామీణ క్రీడా ఆణిముత్యాలను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు. వారి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలే, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి కానీ వారికి పేదరికం అడ్డు కాదనిరూపించారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ పోటిల్లో భాగంగా వారి ప్రతిభను మండలం స్థాయిలో, జిల్లా స్థాయిలో 75 కేజీ కంటే తక్కువ బరువులో కబడ్డీలో ప్రతిభను నిరూపించుకొని ఎంపిక అయ్యి ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నారాయణ్ పేట్ లో ఈ నెల 20 నుండి 23 వరకు జరిగే కబడ్డీ ఆట ఆడడానికి బయలుదేరి వెళ్లారు. మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో వారిని ప్రోత్సహించిన పీఈటీలకు, అధికారులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వారికి ఆర్థిక సహాయం అందించిన సర్వాయిపేట గ్రామ సర్పంచ్ లంగారి రాజును పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారిణిలు మాట్లాడుతూ మంచిగా ఆడి, తమ మండలంకు, గ్రామానికి, అధికారులకు, నాయకులకు మంచిపేరు తీసుకొస్తామని అన్నారు. సర్వాయి పేట గ్రామ సర్పంచ్ లంగారి రాజు స్పందిస్తూ తాను మన గ్రామం నుండి ఉన్నత స్థాయికి ఎదిగే ప్రతి ఒక్కరికి తన వంతు సహాయ, సహాకారాలు ఉంటాయని మీరు గట్టిగా ప్రయత్నం చేసి ఆటలో గెలుపొంది తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి మంచిపేరు తీసుకు రావాలన్నారు. గ్రామంలో వీరిని యువత ఆదర్శంగా తీసుకుని వివిధ క్రీడాలలో, చదువులో రాణించాలని అన్నారు. ప్రస్తుతం ఎంపికైనా వారందరు డిగ్రీ చదువుతున్నారని క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. తమను వెన్నంటి ప్రోత్సహించిన పలిమేల మండల ఇంచార్జి పిఈటి కలుగూరి శేఖర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ




**అక్షర వేదం/ మల్లాపూర్:ఫిబ్రవరి:19** మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో గురువారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపనకు సర్పంచు తేలు నరేష్ భూమి పూజ చేశారు.ఈసందర్భంగా సర్పంచ్ మొదట చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని యువకులు ముందుకు వచ్చి మన గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని దాతల సహకారంతో ప్రతిష్టించుకుందాం అంటూ ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా ప్రతిష్టాపనకు గ్రామంలోని ప్రతి ఇంటి నుండి తలో రూపాయి కలిపేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గంతో పాటు అన్ని రాజకీయ పార్టీల యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ జయంతి వేడుకలు





**అక్షర వేదం జోగులాంబ గద్వాల** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మేలుకురు గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గ్రామ యూత్ పెద్దలు చిన్నలు తో కలిసి చత్రపతి శివాజీ వారికి ఘనంగా జయంతి పండుగను నిర్వహించారు

ఆయన చేసిన గొప్ప గొప్ప యుద్ధలు గురించి మన భారతదేశ గౌరవాన్ని కాపాడే విధంగా గాని చేసిన చత్రపతి శివాజీ మహారాజ్ గమ గురించి కొంత విద్యార్థులు చర్చించుకోవడం గొప్ప విషయం ఊరిలో ఉన్న సనా మెడికల్ గాడుమూరు చంద్రకాంత్ తరపున చిరు బహుమానములను విద్యార్థిని విద్యార్థులకు అందజేయడం జరిగింది

# జూలపల్లిలో దోమల నిర్మూలనకు 'ఫాగింగ్'

**- సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు**



**అక్షర వేదం ప్రతినిధి పెద్దపల్లి కమాన్ పూర్** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో దోమల నివారణే ధ్యేయంగా గ్రామ సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ ఆధ్వర్యంలో గురువారం ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పంచాయతీ సిబ్బందితో కలిసి వీధివీధినా ఫాగింగ్ చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్యం తమకు ముఖ్యమని, దోమల వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

# ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**అక్షర వేదం ప్రతినిధి పెద్దపల్లి కమాన్ పూర్** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణంలో గురువారం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. మహానేత చత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలను ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ హాజరై మహానేత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

అయితే ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పారిశుద్ధ్య కార్మికుల సత్కారం. సమాజ ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ కార్మికులను యువసేన ఘనంగా సన్మానించింది. వారి సేవలకు కృతజ్ఞతగా తాజా కూరగాయలను అందజేసి అభినందనలు తెలిపింది. శివాజీ మహారాజ్ చూపిన సమానత్వ భావనను ఆచరణలో పెట్టిన ఈ చర్యకు హాజరైన వారందరూ ప్రశంసలు కురిపించారు ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకులు జంగపల్లి శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, యువసేన సభ్యులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సేవా భావం, సామాజిక బాధ్యత కలిసిన ఈ జయంతి వేడుకలు చెయ్యడం జరిగింది

# సోషల్ మీడియా లో బి ఆర్ స్ ను దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలి




**అక్షర వేదం, జైపూర్, మంచిర్యాల్ 19** లమంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గం జైపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు బి ఆర్ స్ పార్టీనీ, నాయకులను వ్యక్తి గతంగా దూషనలు, సోషల్ మీడియా లో భాహిరంగా ఇష్టం వచ్చినట్టు భూతులు తిడుతూ పోస్టులు పెట్టినందుకు అట్టి వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకోని జైపూర్ పోలీస్శ్రీ స్టేషన్లో, జైపూర్ మండల బి ఆర్ స్ పార్టీ నాయకులు జైపూర్ పోలీస్ స్టేషన్ లో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# సర్వమత సమబావనే 'శివాజీ' బాట: నగర మేయర్ మహంకాళి స్వామి








**అక్షరవేదం/గోదావరిఖని: ఫిబ్రవరి19** గోదావరిఖని జీఎం ఆఫీస్ వద్ద గల శివాజీ విగ్రహం దగ్గర ఆరె కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యములో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ 397వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి హాజరై చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలవేసారు. కేక్ కట్ చేసి క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.... శివాజీ అందరివాడని కానీ కొంత మంది కొందరివాడిగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా శివాజీ పరమత సహనం పాటించేవాడని అన్ని మతాలను, కులాలను సమానంగా గౌరవించేవాడని అన్నారు. తన సైన్యములో ముస్లిములకు ప్రత్యేక స్థానం కల్పించి అన్ని మతాలు సమానమని చాటాడన్నారు. మండల అధ్యక్షుడు మోహన్ రావు, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు సమ్మారావు, వివిధ డివిజన్ ల కార్పొరేటర్లు కుల సంఘ సభ్యులు చంద్రమోహన్, మీనేష్, రాజేశ్వర్ రావు, వీరన్న, వెంకటేశ్వర్లు, సాయిరాం, శ్యామ్ రావు, మోహనరావు లింగరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా మంథనిలో ఘనంగా హిందువుల ర్యాలీ



**అక్షర వేదం/మంథని,ఫిబ్రవరి19:** మంథని పాత పెట్రోల్ బంక్ నుండి చౌరస్తా మీదుగా గాంధీ చౌక్ వరకు గురువారం రోజున పెద్ద ఎత్తున హిందువులు నీలం చరత్,చంద్ర గంప ఆదిత్య,పీక పవన్ ఆధ్వర్యంలో ఐదు వందల మంది హిందువులు భారీ ర్యాలీ చేశారు.జై శివాజీ,జై భవానీ అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా,మంథని ప్రకండ బాధ్యులు రావుల సతీష్,ప్రచార ప్రముక తూర్పాటి రాము,సహాయ కార్యదర్శి కొమురవెల్లి హరీష్ గుప్త,గుండా శ్రీనివాస్,మెడగొని రాజమౌళి గౌడ్,బజరంగదల్ నరేడ్ల రాజేష్,అన్వేష్, కొమురవెల్లి సత్యనారాయణ ఛత్రపతి శివాజీ సేన సభ్యులు హిందూ బంధువులు తదితరులు పాల్గొన్నారు..

## నూతనంగా ఎన్నికైన మేయర్ మమత శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఎస్.వినోద్ కుమార్



**అక్షర వేదం/ మహబూబ్ నగర్:** నూతనంగా ఎన్నికైన మహబూబ్ నగర్ మేయర్ గుమల మమత శ్రీనివాస్ ని మరియు డిప్యూటీ మేయర్ మరేపల్లి సురేందర్ రెడ్డి ని వారి స్వగృహం లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎస్. వినోద్ కుమార్

## తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్-2026, డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

**- పిఈ జెఏసి స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ రేణికుంట్ల వెంకట్రాజంకు చిరు సత్కారం.**



**అక్షర వేదం/ భూపాలపల్లి/ మహాముత్తారం ఫిబ్రవరి 19 :** తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2026 డైరీ, క్యాలెండర్ ను హైదరాబాదులోని నాంపల్లి టీఎన్జీవోస్ భవన్ లో సెంట్రల్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టీఎన్జీవోస్ పీఇజెఏసి స్టేట్ ప్రెసిడెంట్ మారం జగదీశ్వర్, రాష్ట్ర కార్యదర్శి ముజీబ్, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ రేణికుంట్ల వెంకట్రాజం మాట్లాడుతూ.. తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ కు సంబంధించిన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన రావలసిన అన్ని బకాయిలను త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో హాజరైన ఉద్యోగులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## దేశభక్తి.. దైవభక్తి.. ప్రజాభక్తిలో ఛత్రపతి శివాజీ అందరికీ ఆదర్శప్రాయుడు

**-ఛత్రపతి శివాజీ శోభాయాత్ర నిర్వహించిన బీజేపీ నేతలు అడాల ప్రణయ్ కుమార్, హరీష్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 19 (అక్షర వేదం) :** దేశభక్తి, దైవభక్తి, ప్రజాభక్తిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ప్రతీ ఒక్క భారతీయుడికి ఆదర్శప్రాయుడని బీజేపీ పార్టీ జియాగూడ డివిజన్ కార్యదర్శి అడాల ప్రణయ్ కుమార్ అభివర్ణించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని గురువారం అడాల ప్రణయ్ కుమార్, హరీష్ ల నేతృత్వంలో జియాగూడ కేసరి హనుమాన్ దేవాలయం నుంచి జియాగూడ పురవీధుల మీదుగా సంజయ్ నగర్ నల్లపోచమ్మ తుల్జాభవాని దేవాలయం వరకూ భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయాత్రకు జియాగూడ రోడ్డులో వాడ వాడలా ప్రజలు, పలు సంఘాల నేతలు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శోభాయాత్ర నిర్వాహకులు ప్రణయ్ కుమార్, హరీష్ లను గంగపుత్ర సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. శోభాయాత్ర అనంతరం సంజయనగర్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత విశేషాలపై ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శన, మహా అవతార్, నరసింహా చిత్రాల ప్రదర్శన, పలు దేశభక్తి, ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుల్సుంపురా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించారు.

## ఛత్రపతి శివాజీ 396వ జయంతి ఉత్సవాలు



**అక్షర వేదం, జైపూర్, ఫిబ్రవరి 19** జైపూర్ మండల కేంద్రంలో చత్రపతి శివాజీ సేన కమిటీ ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ 396వ జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. శివాజీ మహారాజ్ ఫోటోను పూలమాలలతో అలంకరించి, బస్టాండ్ నుండి పవర్ ప్లాంట్ గేట్ వరకు ఊరేగిస్తూ... శోభయాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.చత్రపతి శివాజీ మహారాజ్ వీర గాథను కొనియాడుతూ...శోభాయాత్రలో జై భవాని జై శివాజీ మహారాజ్ అంటూ నినాదాలు చేశారు.

# గ్రూప్ వన్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన





**గొల్లపల్లిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర సమీక్ష**

**చింతపల్లి, ఫిబ్రవరి19 (అక్షర వేదం)** రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్--వన్ పరీక్షల్లో ఉత్తీర్ణులై వివిధ హోదాల్లో నియమితులైన ప్రొబిషనరీ అధికారుల క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం భాగంగా చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో రెండు రోజులపాటు విస్తృత పర్యటన నిర్వహించారు. ఒక ప్రొబిషనరీ డిప్యూటీ కలెక్టర్, ముగ్గురు డీఎస్పీలు, ఇద్దరు మున్సిపల్ కమిషనర్లు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

**శాలువాలతో సత్కారం-గ్రామ విహారం**

మొదటి రోజు గ్రామ సర్పంచ్ అనంతుల శ్రీను ప్రొబిషనరీ అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అధికారులు గ్రామంలోని వీధుల వెంట తిరిగి శానిటేషన్ పనులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స్థితిగతులు పరిశీలించారు. సమబావ సంఘాల మహిళలతో సమావేశమై వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు.పాఠశాలలు, అంగన్వాడీలలో పరిశీలన రెండో రోజు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యా ప్రమాణాలు, పోషకాహార పంపిణీ, పిల్లల హాజరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలపై వివరాలు సేకరించారు. విరాట్‌నగర్‌లోని చేతివృత్తి కళాకారులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు.గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు, నిర్వహణ విధానం, అభివృద్ధి పనుల పురోగతిపై మండల పంచాయతీ అధికారి ఇందుజా, ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోరాటి మహేష్, వార్డు సభ్యులు, సిడిపిఓ సక్కుబాయి, సూపర్వైజర్ సుగుణ, అంగన్వాడీ టీచర్లు అనంతుల రజిత, కునరాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శేఖర్, జిపిఓ రమేష్, ఆశా వర్కర్, ఏఎన్ఎం, పోలీస్ కానిస్టేబుల్, వ్యవసాయ విస్తరణాధికారి తదితరులు పాల్గొన్నారు.గ్రూప్--వన్ అధికారుల పర్యటనతో గ్రామంలో అమలవుతున్న పథకాలపై సమగ్ర అవగాహన ఏర్పడి, స్థానిక సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి చేరినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఘనంగా ఉత్సవ ర్యాలీ

**పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**





**మన్సూరాబాద్, ఫిబ్రవరి19 (అక్షర వేదం)** హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఘనంగా ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీ నివాసులు, యువత, మహిళలు పాల్గొనడంతో ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జడ్జెస్ కాలనీలోని శివాజీ పార్క్‌కు చేరుకుని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన ధైర్యం, నాయకత్వం, దేశభక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. పరమతాలను గౌరవిస్తూ హిందూ ధర్మాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శివాజీ మహారాజ్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే శివాజీ పార్క్ ప్రాంగణంలో జడ్జెస్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన కాలనీ పెద్దలు, సంక్షేమ సంఘం ప్రతినిధులు, నివాసులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్సవ ర్యాలీలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, శివాజీ మహారాజ్ సైనికులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొత్తపేట డివిజన్ బిజెపి ఉపాధ్యక్షులు సంగ్రామ్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు





**కొత్తపేట, ఫిబ్రవరి19 (అక్షర వేదం)** కొత్తపేట డివిజన్ మోహన్ నగర్‌లో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని కొత్తపేట డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు సంగ్రామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ హాజరై, శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయికోటి పవన్ కుమార్ మాట్లాడుతూ,.శివాజీ మహారాజ్ ధైర్యం, పరాక్రమం, దేశభక్తి, ధర్మరక్షణకు ప్రతీక. ఆయన చూపిన మార్గం యువతకు స్ఫూర్తిదాయకం. మన సమాజంలో ఐక్యత, న్యాయం, ధర్మబద్ధత కోసం శివాజీ మహారాజ్ ఆశయాలను ఆచరణలో పెట్టాలి" అని పేర్కొన్నారు. అలాగే, శివాజీ మహారాజ్ జీవితం ప్రతి భారతీయుడికి ఆదర్శమని, యువత ఆయన చరిత్రను తెలుసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.జయంతి కార్యక్రమం అనంతరం కార్పొరేటర్ స్థానిక ప్రజలకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ బిజెపి అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్, జంగారెడ్డి, వగ్గుల సుందర్ నారాయణ, ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్, కాటా విజయ గౌడ్, ఠాగూర్ రాజ్ కుమార్, గోవర్ధన్ ఠాగూర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

# జూలపల్లి గ్రామంలో దోమల నిర్మూలన కోసం ఫాగింగ్..

**అక్షర వేదం కమాన్ పూర్ :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్. మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో దోమలపై సమరం కోసం జూలపల్లి సర్పంచ్ పోలుదాసరి వనిత సాయికుమార్ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్ వార్డు సభ్యులు చిట్యాల రాయమల్లు బొల్లంపల్లి సంతోష్ కుమార్ ఇరుగురాల రాజు సోప్పరి సంతోష్ కుమార్ బండి శంకర్ సాగర్ల సౌజన్య ఇరుగురాల జీవనజ్యోతి పులి ప్రవళిక గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

